క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ కమిషనర్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సింహాచలం ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం కమిషనర్‌కు ఎమ్మెల్యే స్వాగతం పలుకుతూ పార్వతీపురం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇప్పటికే గతంలో పనిచేసిన అనుభవం ఉన్నందున ఎక్కడ ఏ సమస్య ఉందో పూర్తిస్థాయి అవగాహన ఉంటుంది కావున మరింత సమర్థవంతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు.

బోధన ప్రక్రియ పరిశీలన



వెంగళరాయపురం పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

బలిజిపేట: విద్యార్థులకు బోధన ప్రక్రియను ఎంఆర్‌సీ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. అందులో భాగంగా వెంగళరాయపురం పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధిస్తున్న అంశాలు, బోధన క్రమం, బోధన పరికరాలు, తదితర అంశాలతో ఏవిధంగా బోధన సాగిస్తున్నారో పర్యవేక్షించారు. బోధన ప్రక్రియ విద్యార్థులకు ఎంతమేర అవగాహన కలుగుతోందో పరిశీలించారు. బోధనలో మెలకువలను విద్యార్థులకు ఉపాధ్యాయుడు వివరించారు. ఈ ప్రక్రియలో నిర్వహించిన అంశాలను టెక్ టూల్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఎంఆర్‌సీ సిబ్బంది మధు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


దిశ యాప్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి



దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

పార్వతీపురంటౌన్: దిశ యాప్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి అని దిశ పీఎస్ ఎస్సై లావణ్య అన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆమె పార్వతీపురం మండలంలోని నర్సిపురం ఉన్నత పాఠశాలలో దిశ యాప్ వినియోగంపై అవగాహన నిర్వహించారు. మహిళల రక్షణకు దిశ ఎస్‌ఓఎస్ యాప్ ఉపయోగపడే విధానాన్ని స్వయంగా వివరించి, వారి మొబైల్స్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, రిజిస్ట్రేషన్ ఎలా చేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభిలాష గ్రంథాలయాల కోసం ప్రత్యేక యాప్



సచివాలయలను సందర్శించిన జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి రామచంద్రరావు

పార్వతీపురంటౌన్: అభిలాష గ్రంథాలయాల కోసం ప్రత్యేక యాప్‌ను తయారు చేసినట్లు జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం ఎంపీడీఓ షేక్ మహమ్మద్ అకిబ్ జావేద్‌తో కలిసి శుక్రవారం ఆయన మండలంలోని ఎంఆర్‌నగర్, లక్ష్మీనారాయణపురం గ్రామ సచివాలయలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా యాప్‌లో యువత పేర్లు నమోదు చేసుకోవాలని, కావలసిన పుస్తకాలను తీసుకు వెళ్లవచ్చని ఆయన తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం యువత భవిష్యత్ కోసం ఈ గ్రంథాలయాలను గ్రామస్థాయిలోనే ఏర్పాటు చేసిందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాల సంరక్షణ గృహానికి బాలనేరస్తుడి తరలింపు

సాలూరు: బాల నేరస్తుడిని రెండేళ్ల పాటు బాల సంరక్షణ గృహానికి తరలిస్తున్నట్లు కోర్టు శుక్రవారం తీర్పు చెప్పి ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2020 సెప్టెంబర్ ఎనిమిదవ తేదీన సాలూరు పట్టణంలోని చిన్నవీధికి చెందిన బాల నేరస్తుడు ఆరేళ్ల పాపపై లైంగికదాడికి పాల్పడినట్లు నమోదైన కేసుపై డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు దర్యాప్తు చేశారు. ఈకేసుకు సంబంధించి విజయనగరం బాల న్యాయ మండలి చైర్మన్ విచారణ చేయగా నేరం నిరూపణ కావడంతో పై విధంగా తీర్పుచెప్పారు.

ఆసరాతో మహిళల జీవితాల్లో వెలుగులు

- పథకాల అమలులో పెద్దపీట
- మాటప్రకారం నాలుగో విడత రుణమాఫీ
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మహిళలకే పెద్ద పీట వేశారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మెంటాడ మండలంలోని కైలాం గ్రామ సమీపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు ఆధ్వర్యంలో క్రికెట్ మైదానంలో శుక్రవారం జరిగిన ఆసరా నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి సిబ్బంది ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను 99శాతం అమలు చేసి మహిళా పక్షపాతిగా నిరూపించుకున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలకు నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేయడం ద్వారా అవినీతికి తావులేకుండా సంక్షేమాన్ని అమలు చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే ఈ పథకాలన్నీ మనకు మళ్లీ వచ్చే అవకాశం శతశాతం ఉంది కావున మీరంతా జగనన్నకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

అన్ని సర్వేల్లో వైఎస్సార్‌సీపీదే అధికారం

ఇప్పటికే దేశంలోనే పేరుగాంచిన ప్రధాన పత్రికలైన టైమ్స్ ఆఫ్ ఇండియా, పబ్లిక్ హెల్త్‌సర్వీస్, న్యూస్ ఎరీనా ఇండియా, ఇండియాటుడే వంటి సంస్థలు మళ్లీ శతశాతం జగన్‌మోహన్ రెడ్డే ఏపీ సీఎం అవుతారని ఘంటాపథంగా చెబుతున్నాయని రాజన్నదొర పేర్కొన్నారు. అనంతరం మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, ఎంపీటీసీ చప్పసూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లెంకరత్నాకర్, కనిమెరక త్రినాథరావు, చొక్కాపు సన్యాసినాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, మయూర్ అప్పలనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు, లచ్చిరెడ్డి అప్పలనాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు సతీష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాంబాబు, ఎంపీడీఓ లక్ష్మీబాయ్, ఏపీఎం సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రకృతివ్యవసాయశాఖ సిబ్బంది వేసిన ముగ్గులను చూస్తున్న రాజన్నదొర

మహిళా సంఘాలు జగనన్న వెంటే



ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి మా ఆర్థిక ఇబ్బందులను జగనన్న గట్టెక్కిస్తున్నారు.ఆయనకు మా మహిళా సంఘాల తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుంది.నాలుగేళ్లలో రూ.40వేలు రుణమాఫీ పొందాను.

– రెడ్డి రామలక్ష్మి, దుర్గాదేవి పొదుపుసంఘం, ఆగూరు

ఓ అన్న మాదిరిగా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మా అన్న మాదిరిగా కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. ఆర్థికంగా ప్రోత్సహిస్తూ మాకు భరోసా కల్పిస్తున్నారు. ఇలాంటి అన్నయ్య వల్ల రాష్ట్రంలోని ప్రతి పేద మహిళకు ఆర్థిక న్యాయం జరుగుతుంది. మేమంతా జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నాం.

– పాశల సరస్వతి, భవాని మహిళా పొదుపు సంఘం, కేబీవలస

జగనన్నకు రుణపడి ఉంటాం



గత ప్రభుత్వాలు అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో విజయవంతంగా అమలు చేసి చూపించారు. నేను ఇప్పటికి చాలామంది ముఖ్యమంత్రుల్ని చూశాను. ఇలా ఇచ్చిన మాటమీద నిలబడి మహిళల సంక్షేమం కోసం ఆలోచన చేసే ముఖ్యమంత్రిని మాత్రం జగన్‌బాబులోనే చూస్తున్నాను. నాకు పెద్దకుమారుడు జగన్. నాకు నాలుగుపార్లు ఆసరా డబ్బులు వేశారు. వాటితో ఒకసారి వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్నాను. ఇంకోసారి బంగారం కొనుక్కున్నాను.ఇలాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఈ జగనన్నే మళ్లీ ముక్యమంత్రి కావాలని కోటి దేవుళ్లకు మొక్కుతున్నాను.

– అవుగుడ్డి సన్యాసమ్మ, తమ్మిరాజుపేట గ్రామం

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- బూత్‌స్థాయి పార్టీ కేడర్‌కు ఎమ్మెల్యే దిశానిర్దేశం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం మండలంలోని సుడిగాం, పెదబొండపల్లి పంచాయతీల్లో గల 89 నుంచి 94 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సమయం చాలా తక్కువ ఉన్నందున బూత్ స్థాయి పార్టీ కేడర్ పూర్తిస్థాయిలో సన్నద్ధం అయ్యేందుకు ప్రతి బూత్ పరిధిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మొత్తం 233 పోలింగ్ బూత్‌లలో పూర్తిస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని వివరించి ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలోనూ వైఎస్సార్‌సీపీ ఆధిక్యమే లక్ష్యంగా తీవ్ర కసరత్తు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు, స్థానిక సర్పంచులు పైల సూర్యనారాయణ, సవరాపు రాజారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మజ్జి శేఖర్, చందాన శివాజీ, అల్లం వెంకట్రావు, వంగపండు కృష్ణ, యండ్రాపు శ్రీరాములు నాయుడు, జక్కు చిన్నం నాయుడు, పప్పల శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుండ్రెడ్డి దామోదర్ రావు, బోగిల సింహాచలం, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మక్కువలో వైఎస్సార్ ఆసరా

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో శనివారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరగనున్నట్లు వెలుగు ఏపీఎం సన్నిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరుకానున్నట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్నం రైతుభరోసాకేంద్రం, సచివాలయాన్ని డిప్యూటీసీఎం రాజన్నదొర ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు తెలిపారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: బలిజిపేట ఎంపీడీఓగా ఎస్.రమేష్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎంపీడీఓలకు బదిలీలు నిర్వహించిన విషయం విదితమే. అందులో భాగంగా రమేష్‌నాయుడు శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి బలిజిపేటకు బదిలీపై రాగా, బలిజిపేట ఎంపీడీఓగా పనిచేసిన విజయలక్ష్మి శ్రీకాకుళం జిల్లా టెక్కలికి బదిలీ అయ్యారు.

సీతానగరం ఎంపీడీఓగా ఈశ్వరరావు



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం. ఈశ్వరరావు

సీతానగరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.ఈశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎం ఈశ్వరరావును సీతానగరం ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో ఇక్కడి ఎంపీడీఓ ఎల్ఎన్ ప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పూర్తి బాధ్యతలతో ఎంపీడీఓగా పని చేసిన బి.మహేష్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎంఎల్ఎన్ ప్రసాద్ ఎఫ్ఏసీ ఎంపీడీఓగా ఇంతవరకు పనిచేశారు. కార్యక్రమంలో ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, కార్యాలయం జూనియర్ సహాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాలూరు ఎంపీడీఓగా ఫణీంద్ర కుమార్



సాలూరు: ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, అధికారులు

సాలూరు: సాలూరు ఎంపీడీఓగా కుప్పిలి ఫణీంద్ర కుమార్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఆయనకు వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది తదితరులు ఆహ్వానం పలికారు.

పుస్తక రచయితకు ప్రశంసలు



శంకరరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామ్‌మాధవ్

సీతానగరం: ప్రస్తుతం విద్యావిభాగం ఎలా ఉంది? ఉపాధ్యాయ విద్యకు కావలసిన ముడిసరుకు ఏమిటి? జాతీయ సమగ్రత లక్ష్యం, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక అభివృద్ధి గురించి తెలుసుకోవడం ఎలా? అనేది ఎన్ఈపీ 2020 లక్ష్యం సోషియలాజికల్ ఫౌండేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ)లో తెలుసుకోవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. సీతానగరం మండలంలోని గుచ్చిమి పంచాయతీ తాన్న సీతారాంపురం గ్రామానికి చెందిన కొచ్చెర్ల శంకరరావు అరకు ప్రైవేట్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆయన రచించిన పుస్తకాన్ని ఇటీవల ఓ రిసార్ట్స్‌లో ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్, కర్నూలు ఐఐటీ ప్రొఫెసర్ వెంకటరావు, కృష్ణ, ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు శంకరరావును ప్రశంసించారు.

కేఎస్ పురం ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ్య పనులు



పిచ్చిమొక్కలను తీయిస్తున్న హెచ్ఎం సీహెచ్ శ్రీదేవి

సీతానగరం: మండలంలోని కోటసీతారాంపురం ఉన్నత పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగింపు పనులను హెచ్ఎం సీహెచ్ శ్రీదేవి శుక్రవారం కూలీలతో నిర్వహించారు. ఈ మేరకు హెచ్ఎం శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలో నిరంతరం విద్యార్థులు తిరుగాడడంతో ఇబ్బందులు పడుతున్న కారణంగా ఎస్ఎంసీ కమిటీ సభ్యుల సూచనల మేరకు కూలీలతో పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు తీసిన మొక్కలను దూర ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. అలాగే రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని దీర్ఘకాలంగా ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించామని, బోరు నుంచి ప్రధాన వాటార్ పైపలైన్‌ను మరమ్మతు చేసి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మంచినీటి సౌకర్యం కల్పించామని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల భవనాల చుట్టూ పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్లు తెలియ జేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

రైతులకు పురుగు మందుల పంపిణీ



రైతుభరోసా కేంద్రంలో పురుగు మందులను పంపిణీ చేస్తున్న రాబర్ట్‌పాల్

బలిజిపేట: రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన పురుగు మందులను పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పదమాయవలస రైతుభరోసా కేంద్రంలో జిల్లాలో ప్రప్రథమంగా రైతులకు శుక్రవారం పురుగు మందులను పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఇంతవరకు ఎరువులు, విత్తనాలను మాత్రమే పంపిణీ చేసేవారని, ఇకపై పురుగు మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందుకుగాను ఏఏ పురుగుల మందులు అవసరమో ముందుగా రైతులు రైతు భరోసా కేంద్రాలలో వివరాలు తెలియజేసి దానికి తగిన డబ్బులు ముందుగానే చెల్లించాలని సూచించారు. అలా చెల్లించడం వల్ల ఏపీ సీడ్స్‌వారికి ఇండెంట్ పెట్టనున్నట్లు తెలిపారు. దీనిని రైతులు గుర్తించాలని కోరారు. వేపనూనె 300పీపీఎమ్, క్లోరిపైరిపాస్ 50శాతం ఈసీ మందులను శుక్రవారం సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో వరి, మొక్కజొన్న పంటకు అవసరమైన పురుగు మందులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.మోహనరావు, ఏఓ శ్రావణ్, కోరమాండల్ కంపెనీ ఏఎంఆర్ఓ మహేష్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సేవలు వినియోగించుకోవాలి



ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని పలగరలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరానికి ఆయన హాజరై శిబిరం వద్దకు వచ్చిన వైద్యాధికారులతో మాట్లాడి హాజరైన రోగులకు అవసరమైన సేవలు అందించాలని కోరారు. అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటుపడుతున్నారాన్నరు. అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన సేవలు అందేవిధంగా చూడాలని వైద్యులకు చెప్పారు. ప్రతి కౌంటర్ వద్ద రోగులకు ఎటువంటి వైద్యసేవలు అందుతున్నాయి, ఏఏ రకాల మందులు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వై.జాన్, ఎస్.భాస్కరరావు, కె.లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి



గుడివాడకాలనీలో పాఠశాల పరిసరాలపై సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: పోలింగ్ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రహరీలు ఉన్నప్పటికీ వాటి లోపల భాగం, బయట పరిసరాలు శుభ్రంగా లేనిచోట కఠినంగా సూచనలు ఇచ్చి వాటిని శుభ్రం చేయించాలని ఆర్డీఓ హేమలత ఆదేశించినట్లు తెలిపారు. సక్రమంగా రహదారి సదుపాయం లేని పోలింగ్ కేంద్రాలకు రహదారి నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. మండలంలో గురువారం పరిశీలించిన పోలింగ్ కేంద్రాలలో కొన్నింటికి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేనందున వాటిపై దృష్టిసారించి పూర్తిచేయించాలని ఆర్డీఓ ఆదేశించారని వాటి పనులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీవార్మింగ్ మాత్రలు వేసేందుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ పావని

సీతానగరం: నులిపురుగుల నివారణ (డీవార్మింగ్) మాత్రలు వేయడానికి మండలంలోని వైద్యాధికార సిబ్బంది సన్నద్ధం కావాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావని కోరారు. త్వరలో రానున్న జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సీహెచ్‌ఓ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలతో పాఠశాలలు, ఇళ్లవద్ద చిన్నారులకు నులిపురుగుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినం రోజున జాతీయస్థాయిలో కూడా వైద్య సిబ్బందితో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలు వారి పిల్లలకు వేయించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, రచ్చబండలు, రామమందిరాల వంటి ప్రాంతాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ జీవీ శర్మ, హెల్త్ విజిటర్ కె.భవాని, పీహెచ్‌ఎన్ కె.సత్యవతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్స్ ఉపయోగించాలి



రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ సిబ్బంది

పార్వతీపురంటౌన్: హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్స్ ఉపయోగించడం తప్పనిసరని జిల్లా రవాణా శాఖాధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. ఈ మేరకు రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్టు వాహనాలకు రిఫ్లెక్టర్ టాప్స్ అతికించి వాహన డ్రైవర్స్‌కు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్, ఇతర రహదారి భద్రతపై పూర్తి అవగాహన కల్పించారు. వాహన డ్రైవర్స్‌కు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ, ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ ధరించడం, హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్స్ ఉపయోగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో రవాణా, పోలీస్, మెడికల్, ఏపీఎస్ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.